# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఖరీఫ్ పంటకాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా అవినీతి రహిత పాలన అందిస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.
- విశాఖలో ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేశారు.

====================

ఖరీఫ్ పంటలను తుఫాన్ల నుంచి రక్షించుకునేలా పంటకాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు ఉండవల్లిలో ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 365 రోజులు సాగుభూములు పచ్చగా ఉండేలా చూడాలని... ఇందుకోసం 3 పంటల విధానం తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. వచ్చే వేసవిలో జలవనరుల లభ్యత ఉన్న 141 మండలాల్లోనూ పంటల సాగు జరిగేలా రైతులను సన్నద్ధం చేయాలన్నారు. అలాగే వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలను పండిచేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి... భూసారాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు కోరిన 24 గంటల్లోనే బ్యాంకులు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయణిస్తోందని కేంద్ర గనుల శాఖా మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ఈ 11 సంవత్సరాల కాలంలో అవినీతికి వ్యతిరేకంగా పాలన అందించామని కిషన్ రెడ్డి పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

====================

ప్రతీ ఒక్కరూ భాధ్యతగా వ్యవహరించి "అంతర్జాతీయ యోగా దినోత్సవ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ఈరోజు ఆయన విశాఖపట్నంలో సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో యోగా దినోత్సవానికి సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. ప్రపంచమంతా విశాఖవైపు చూసేలా యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పక్కా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని... ప్రజల వేడుకని, అందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యులు కావాలని నారా లోకేష్ పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

====================

పోలవరం ప్రాజెక్టు నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి... పనులు నిర్ణీత వ్యవధిలోనే జరుగుతున్నాయని చెప్పారు. డయాఫ్రం వాల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వర్షాకాలంలో కూడా పనులు జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బట్రస్ డ్యామ్ పనులు పూర్తి కావొచ్చాయన్నారు. ఇప్పటికే పోలవరం హెడ్ వర్క్స్ 80 శాతానికి పైగా పూర్తయ్యాయని తెలిపారు. 2027 చివరి నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా ప్రణాళికాలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు.

విరామం

====================

కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర స్థాయి వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. "సుపరిపాలన – స్వర్ణాంధ్ర" పేరుతో12వ తేదీన గురువారం ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, అఖిల భారత సర్వీసు అధికారులతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

====================

అరటి, పెసర, మినుము, వరి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని వెంకట్రామన్న గూడెం కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణాధికారి డాక్టర్ వి. దీప్తి అన్నారు. "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం రామన్నపాలెంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల ప్రాధాన్యాత, సేంద్రియ వ్యవసాయ విధానాలను, సమగ్ర ఎరువుల నిర్వహణను రైతులకు వివరించారు.

అలాగే శ్రీ సత్య సాయి జిల్లా పెంగళమ్మ చెరువులో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు త్రికాల మాధవి, సుబ్రహ్మణ్యం, దురైమురుగన్ పాల్గొన్నారు. ఈ సందర్భముగా త్రికాల మాధవి మాట్లాడుతూ, రైతులు పంటలు పండించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అనేక సలహాలు, సూచనలు అందిస్తున్నామని ఆమె వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కింద సౌరపలకల ఏర్పాటుకు సోలార్ మేళా పేరుతో అవగాహన సదస్సులను చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలుపై కలెక్టర్ ఈరోజు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సౌరపలకల ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ తో ఇంటి అవసరాలను తీర్చుకోవడంతో పాటు మిగులు విద్యుత్ ను తిరిగి గ్రిడ్ కు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. ఈ విషయంపై అవగాహన పెంచడంలో భాగంగా క్లస్టర్ స్థాయిలో విరివిగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు నెలవారీ వాయిదాల్లో చెల్లింపులు చేసేలా బ్యాంకర్లు ఋణాల మంజూరుకు చేసేందుకు చొరవ చూపాలని కలెక్టర్ కోరారు.

====================

ఆత్మనిర్భర భారత్, మేక్ ఇన్ ఇండియా లాంటి దార్శనికతలకు అనుగుణంగా గత 11 సంవత్సరాల్లో తీసుకొచ్చిన నిర్ణయాత్మక సంస్కరణలు, బాధ్యతాయుతమైన పాలనతో సురక్షితమైన భారతదేశం కళ సాకారమయ్యింది. అయితే ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత 11 ఏళ్ల ప్రయాణంలో ప్రవేశపెట్టిన స్వయం సమృద్ధి విధానాలతో బలోపేతమైన భారత రక్షణ రంగంపై ఆకాశవాణి వార్తా విభాగం అందిస్తున్న ప్రత్యేక కథనం ఇప్పుడు విందాం.

(వాయిస్ 38 సెకన్లు)

====================

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “దర్తీ అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్”పై గిరిజనులకు అవగాహన కల్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈరోజు దర్తీ ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం అమలుపై అధికారులతో ఆయన దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాడేరు ఐటిడి ఏ పరిధిలో 260 గ్రామాలు ఈ పథకానికి ఎంపికయ్యాయన్నారు. ఈనెల 15 నుండి 30వ తేదీ వరకు రెండేసి గ్రామాల చొప్పున ఈ పథకంపై అవగాహనా సదస్సులు నిర్వహించాలని చెప్పారు.

====================
====================